### ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

# హామీలన్నీ నెరవేర్చారు.. చరిత్ర సృష్టించారు

● వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ ● రామచంద్రాపురం నియోజకవర్గ ప్రజల ఆత్మీయ సమ్మేళనం ● హాజరైన రామచంద్రాపురం అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక



ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు



ఎమ్మెల్యే అభ్యర్థి సూర్య ప్రకాశ్, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌రావును సన్మానిస్తున్న అభిమానులు

నిజాంపేట్: ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని నిజాంపేట్ సప్తపది ఫంక్షన్‌హాల్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న రామచంద్రాపురం నియోజకవర్గ ప్రజల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి రామచంద్రాపురం ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

**సంక్షేమ పథకాలకు రూ.2.61లక్షల కోట్లు వెచ్చించాం..**

◆ ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. అన్నీ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు రూ.2.61లక్షల కోట్ల నిధులను వెచ్చించారన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన ఇచ్చిన 642 హామీల్లో కేవలం 40 మాత్రమే అమలు చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు మళ్లీ ప్రజలను ఎలాగైనా మోసం చేయాలని చూస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన జననేత జగన్‌మోహన్‌రెడ్డి..**

◆ దేశంలో ఏ ప్రధానమంత్రి, ఏ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయలేదని కేవలం ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే హామీలన్నీ అమలు చేసి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పేద కుటుంబం బాగుండలంటే.. ప్రతి విద్యార్థి చదువుకోవాలంటే.. ప్రతి రైతు సంతోషంగా ఉండాలంటే.. ప్రతి యువకుడు బాగుపడాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అన్ని సామాజిక వర్గాల్లోని నేతలకు సరైన అవకాశాలు కల్పిస్తూ పంచాయతీ నుంచి ఉభయసభలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. అందుకు తానే ఓ ఉదాహరణ అని పేర్కొన్నారు.

అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌రావు మాట్లాడుతూ... రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అవకాశాలు, సంక్షేమ పథకాలు సక్రమంగా జరగాలంటే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించాలని పిలుపునిచ్చారు. పేద వర్గాలకు న్యాయం చేసే నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజలకు అనునిత్యం పనిచేసే తనను అదే విధంగా రామచంద్రాపురం ఎమ్మెల్యే అభ్యర్థి సూర్య ప్రకాశ్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల్లో చంద్రబాబు ఎన్ని జిమ్మికులు చేసినా ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని బలపరిచేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

**పేదలకు న్యాయం చేసే నేత జగన్‌మోహన్‌రెడ్డి**
రాపాక వరప్రసాద్‌రావు

## జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంను చేద్దాం

రామచంద్రాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. అన్నివర్గాల ప్రజల భవిష్యత్‌ను తీర్చిదిద్దే వైఎస్సార్‌సీపీకే అందరూ ఓటు వేయాలని కోరారు. మరో 45 రోజుల్లో ఎన్నికలు ఉన్నాయని ప్రతి ఒక్కరూ ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంగా చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు జతకట్టి కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. రామచంద్రాపురం నియోజకవర్గ ప్రజలు ఎక్కడ ఉన్నా అందరికీ తానెప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు 125 సార్లు బటన్ నొక్కి ప్రారంభించి అమలు చేశారు. అలాంటి నాయకుడి కోసం ప్రజలంతా ఈసారి ఒకటి ఎమ్మెల్యే అభ్యర్థికి, రెండోది ఎంపీ అభ్యర్థికి బటన్ నొక్కి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు చింతలపాటి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్



నిజాంపేట్ సప్తపది ఫంక్షన్‌హాల్ వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కోలాహలం

## మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న విప్లవజ్యోతి అల్లూరి పౌండేషన్ సభ్యులు

జీడిమెట్ల: దాహంతో ఉన్న బాటసారులకు మంచినీటితో పాటు మజ్జిగ పంపిణీ చేయడం సంతోషంగా ఉందని విప్లవజ్యోతి అల్లూరి పౌండేషన్ సభ్యులు అయినంపూడి నాగరాజు అన్నారు. ఆదివారం సూరారం సాయిబాబాగుడి వద్ద పౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జంగా తాతాజీ అప్పని నరసింహా, నాగరాజు, నిఖిలేశ్వర్, తులసి, కృష్ణవేణి, గంగాధర్, విజయ్‌కుమార్, ప్రభాకర్, పనింద్రరాజు, నాని తదితరులు పాల్గొన్నారు.

## సత్కారం



కార్మిక నేత మదన్‌గౌడ్‌ను సత్కరిస్తున్న ముస్లింలు

కుత్బుల్లాపూర్: రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైందని.. ఈ మాసంలో చేసే దానాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఐఎన్‌టీయూసీ నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసానికి ముస్లిం పెద్దలు విచ్చేసి ఆయన్ని శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మదన్‌గౌడ్ మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో బీద ప్రజలకు సాయం చేసి మానవతను చాటుకోవాలన్నారు.

## తాగునీటి పైపులైన్ పనుల పరిశీలన



తాగునీటి పైపులైన్ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్

నిజాంపేట్: తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పైపులైన్ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ ప్రధాన రోడ్డులో కొనసాగుతున్న పైపులైన్ పనులను ఆయన హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజర్ సాయిరామ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ధన్‌రాజ్‌యాదవ్ మాట్లాడుతూ.. నూతన పైపులైన్ వ్యవస్థ పూర్తయితే నిజాంపేట్ ప్రాంత ప్రజలకు అదనంగా తాగు నీరు అందుతుందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్ లైన్ మెన్‌లు సమరసింహారెడ్డి, మేకల బాలకృష్ణ, ఆనంద్ రెడ్డి, కాంట్రాక్టర్ తదితరులు ఉన్నారు.

## అన్నమయ్య సంకీర్తన ర్యాలీ



తెల్లవారుజామున అన్నమయ్య కీర్తనలు పాడుతూ ర్యాలీగా వెళ్తున్న దృశ్యం

నిజాంపేట్: ప్రముఖ వాగ్గేయకారుడు అన్నమయ్య ఆరాధనా ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం వివేక చూడామణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్, కె.ఎన్.ఎస్ మ్యూజిక్ అకాడమీల ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించారు. తెల్లవారుజాము 5గంటల నుంచి 6గంటల వరకు 80 మంది విద్యార్థులతో అన్నమయ్య సంకీర్తనలు పాడుతూ, శాస్త్రీయ నృత్యాలు చేస్తూ నగర సంకీర్తనను కొనసాగించారు. అన్నమయ్య సంకీర్తనల ప్రాధాన్యతను తెలిపేందుక ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



ప్రగతినగర్‌లో ఓటర్ నమోదును ప్రారంభించిన బీజేపీ నేత మల్లారెడ్డి

నిజాంపేట్: భారత రాజ్యాంగ ప్రసాదించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన ప్రగతినగర్‌లో లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం కొత్త ఓటర్ల నమోదును ప్రక్రియను పొడిగించిందన్నారు. గడువు లోపు అర్హులైన ప్రతి ఒక్కరూ ఆధార్, విద్యుత్ బిల్లు, గ్యాస్ బిల్లులను ఉపయోగించుకుని ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, ప్రసాద్ రాజు, కౌశిక్ నాయుడు, అశోక్ నాయక్, సాయిరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

## 'నా ఆరోగ్యం - నా హక్కు'



జగద్గిరిగుట్ట: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం జగద్గిరిగుట్టలో డాక్టర్ జాహ్నవి, సత్యనారాయణతో కలిసి హెల్పింగ్ ఆర్మ్స్ సొసైటీ సభ్యులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. నా ఆరోగ్యం –నా హక్కు'అనే అంశంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ పని చేస్తుందన్నారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు సాగాలని డాక్టర్లు జాహ్నవి, సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు డాక్టర్లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తూటే విజయ్‌కుమార్, సామాజిక వేత్త మధుబాబు, బుచ్చిబాబు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకొస్తా



కొంపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: దేశం అభివృద్ధి పథంలో పయనించాలంటే బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని.. లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపిస్తే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకొస్తానని ఆ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం కొంపల్లి మున్సిపల్ పరిధిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా నాయకుడు రాజిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, పలు సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## చెరువులను కాపాడాలి

జగద్గిరిగుట్ట: నీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకుంటేనే నీటి ఎద్దడి నుంచి బయటపడతామని సీపీఐ కార్యదర్శి ఉమామహేష్, ఎమ్మెల్యే కంటెస్టెంట్ సాయికుమార్ పంతులు అన్నారు. ఆదివారం పరికి చెరువు సమీపంలో వారు మాట్లాడుతూ సుమారు 112ఎకరాల్లో పరికి చెరువు విస్తరించి ఉండేదన్నారు. ప్రస్తుతం ఈ చెరువును పూడ్చి కోర్టు ఆర్డర్ పేర అమాయకులకు అమ్మి మోసం చేస్తున్నారని అన్నారు.ఇంతకు ముందు కూడా ఈ విషయమై ఫిర్యాదు చేసామన్నారు. రెవెన్యు అధికారులు ఈ చెరువు స్థలంలో కూల్చివేతలు కూడా చేసారని తెలిపారు. మళ్లీ అదే చోట ఇప్పుడు నిర్మాణాలు చేపడుతున్నారని వారు తెలిపారు. ఇలా చెరువులను కాపాడకపోతే ముందు ముందు తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడి బెంగళూర్‌లో ఏర్పడిన సంక్షోభం మనకు కూడా ఎదురు కావచ్చని అన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో హరినాథ్, శ్రీనివాస్, సదానంద్, సహదేవ్, వెంకటేష్, ఇమామ్, విక్రం, శివ తదితరులు పాల్గొన్నారు.



చెరువులను కాపాడాలంటూ బ్యానర్‌తో ఉమామహేష్,సాయికుమార్ పంతుల

## ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం అభినందనీయం

సుభాష్‌నగర్: వినికిడి సమస్యతో బాధ పడుతున్నవారికి ఉచిత వైద్య పరీక్షలు చేయడం అభినందనీయమని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూరారం కాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవన్‌లో ఆశ్రయ్ ఆకృతి ఆస్పత్రి సౌజన్యంతో చెవిటి సమస్యలతో బాధ పడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి మందులు అందజేయడంతో పాటు హియరింగ్ పరికరాలను అందుబాటులో ధరలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సురేష్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని కోరారు. ఆశ్రయ్ ఆకృతి ప్రాజెక్టు కోఆర్డినేటర్ హరికృష్ణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, అంజయ్య, నరేందర్ రెడ్డి, శివాగౌడ్, విజయ్, వెంకట్ రెడ్డి, రాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కుత్బుల్లాపూర్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. బిహార్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్(20) బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి దూలపల్లిలోని సర్వే నెంబరు 169లో నివాసముంటున్నాడు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో తాను పని చేస్తున్న మయూర్ మాడ్యూలర్స్ పరిశ్రమ ఆవరణలో కొబ్బరి చెట్టు నుండి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో షాక్ గురయ్యాడు. అతన్ని వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఎడారిగా మారింది

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: వంద రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఎడారిగా మారిందని, పంట పొలాలకు నీళ్లు విడుదల చేయకపోవడంతో రైతులు పండించిన పంటలు ఎండుతున్నాయని మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కుత్బుల్లాపూర్ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్, లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని అన్నారు. బలహీనవర్గాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, బస్తీదవాఖానా వంటి సంక్షేమ పథకాలను అందించిన ఘనత తమ పార్టీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. అమలుకాని హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

◆ గతంలో మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి ఈ ప్రాంతాన్ని విస్మరించారని అన్నారు. హుజూరాబాద్ ఓటర్లు తిరస్కరించిన ఈటల రాజేందర్ ఏ సంబంధం లేని మల్కాజ్‌గిరిలో పోటీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో కుగ్రామంగా ఉన్న కుత్బుల్లాపూర్ నేడు నియోజకవర్గ స్థాయిలో అభివృద్ధి సాధించిందంటే అది బీఆర్ఎస్ వల్లే సాధ్యపడిందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చింతల్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

## కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించడం ఖాయం



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



శ్రీశైలంగౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

కుత్బుల్లాపూర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆదివారం గాజులరామారంలోని క్యాంప్ కార్యాలయానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకుని శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... తాను 27 ఏళ్లు కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి కృషి చేశానన్నారు. తిరిగి పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పని చేసి పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. ఐఎన్‌టీయూసీ నాయకుడు గుంజ శ్రీనివాస్, దూలపల్లి కౌన్సిలర్ శివ కుమార్, కాంగ్రెస్ నేతలు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, చాంద్ పాషా, జహంగీర్, లాల్ మహ్మద్, యాదిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, పరశురామ్, పండరి, జేమ్స్, దేవకర్ణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు



నిజాంపేట్ స్ప్రింగ్ విల్లాగేటెడ్ కమ్యూనిటీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి



జీడిమెట్ల భీమాప్రైడ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థిసునీతా మహేందర్‌రెడ్డి

నిజాంపేట్: మల్కాజ్‌గిరి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ స్ప్రింగ్ విల్లా గేటెడ్ కమ్యూనిటీవాసులతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి భూపతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కాలనీ వాసులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావాలంటే రాష్ట్రం నుంచి అత్యధిక ఎంపీ స్థానాలను కైవసం చేసుకోలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ నీలారెడ్డి, కుత్బుల్లాపూర్ బీ-బ్లాక్ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, కొలన్ గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు చిట్ల దివాకర్, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, ఆగం పాండు తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్రానికి మరిన్ని నిధులు రావాలంటే ఎంపీగా గెలిపించాలి: సునీతా**

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరి పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న తనకు ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతమహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్ టీఆర్ఆర్ నార్త్‌సిటీ రెసిడెన్సీ, భీమా ప్రైడ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌లు పాల్గొన్న కార్యక్రమంలో సునీతా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రానికి మరిన్ని నిధులు రావాలంటే ఎంపీగా తనను ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్యోత్స్న శివారెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రవణ్‌కుమార్, పటాన్‌చెరు ఇన్‌చార్జ్ బండి శ్యామ్‌గౌడ్, కుత్బుల్లాపూర్ ఏ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు బేకు శ్రీనివాస్, డివిజన్ ఇన్‌చార్జ్ పూర్ణ చందర్, సెక్రటరీ పుల్లం రాజు, గౌరిగే బాలప్ప, నార్త్ సిటీ రెసిడెన్సీ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్, భీమా ప్రైడ్ రెసిడెన్సీ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్‌లిమిటెడ్ బిర్యానీ @140



అక్కడ చికెన్ బిర్యానీ ధర 190 రూపాయలు. అది కూడా లిమిటెడ్ మాత్రమే. బిర్యానీ ప్రియులకు తమ హోటల్ బిర్యానీ రుచిని చూపించాలని కేవలం రూ.140కే అన్‌లిమిటెడ్ ఆఫర్ పెట్టారు. ఇక అంతే.. విషయం తెలుసుకున్న బిర్యానీ ప్రియులు ఆ హోటల్‌కు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో కుటుంబ సమేతంగా తరలివచ్చి లొట్టలు వేసుకుంటూ బిర్యానీ ఆరగించారు. సినీప్లానెట్ సమీపంలో ఉన్న ఆ హోటల్ నిర్వాహకులు మాట్లాడుతూ.. శనివారం 3వేలకు పైగా తమ హోటల్ బిర్యానీ తిన్నారని తెలిపారు. – సుభాష్‌నగర్